# రామమార్గమును అనుసరించటమే రామాయణములోని అంతరార్థము

ప్రాచీన కాలమునుండి భారతదేశము ఆధ్యాత్మిక తత్త్వ ప్రచారముద్వారా అన్ని దేశాలకు సుస్థిర శాంతి, భద్రతలను చేకూరుస్తూ వస్తున్నది. నాటికి, నేటికి 'లోకాస్సమస్తా సుఖినోభవంతు' అన్నదే హైందవ సాంప్రదాయమై ఉన్నది. ఈ సాంప్రదాయాన్ని, సంస్కృతిని అభివృద్ధి గావించటానికి ఆనాటి రాజులు, ఋషులు, మునులు, పండితులు, పతివ్రతామతల్లులు తమ జీవితాలను త్యాగము చేశారు. అట్టి పవిత్రమైన సంస్కృతికి ప్రతీక, రామ చరిత్ర. దీనినే 'రామాయణము' అనే పేరుతో పిలుస్తూ వచ్చారు. ఐతే, రామాయణమనగా కేవలము రామ చరిత్ర మాత్రమే కాదు. 'రామ అయనమ్ యితి రామాయణం'. అయనమనగా మార్గము. రామ మార్గాన్ని అనుసరించటమే రామాయణము అంతరార్థము.

**మానవుడు మానవునిగా బ్రతకాలంటే అనేక కష్టనష్టాలను ఎదుర్కొనవలసి వస్తుంది**

మానవుడు జన్మించినది మొదలుకొని తన జీవిత సాంప్రదాయ సంస్కృతులను నిలబెట్టుకోవటానికి అనేక విధాల కృషి సలుపుతున్నాడు. పుట్టినప్పుడు యెట్టి దుర్గుణాలతో సంబంధములేక నిర్గుణ స్వరూపుడై ఉంటాడు. కాలము కదలినకొలది, ఆహారము మారినకొలది, అభిరుచులు అభివృద్ధియైనకొలది, సహవాస దోషములవలన మనుష్యుల వేషభాషలుకూడా మార్పు చెందుతాయి. రాగద్వేషాలు చోటు చేసుకుంటాయి. చదువుతోబాటు అహంకారాభిమానాలు ఆపాద మస్తకము వ్యాపించి వీరవిహారము చేస్తుంటాయి. తనకంటె గొప్పవాడు, మంచివాడు లేడని భ్రమిస్తాడు. యవ్వనము మత్తులో ఉన్మత్తుడై ఎదుటి వ్యక్తిని గడ్డిపోచకంటె హీనముగా చూస్తాడు.

మానవుడు మానవుడుగా బ్రతకాలంటే అనేక కష్టనష్టాలను, అరిష్టాలను యెదుర్కోవలసి ఉంటుంది. ఎదురు దెబ్బలకు తట్టుకొని ముందుకు సాగిపోవలసి వస్తుంది. కానీ, యీనాటి మానవునికి విషయవాసనలే విందు భోజనములుగా కనుపిస్తున్నాయి. ప్రతివాడు గొప్ప విద్యావంతుడు కావాలని, నాయకుడు కావాలని, పెద్ద వ్యాపారస్తుడు కావాలని అనేక రకాల



sri sathyasai vachanamrutam

ఆశలతో ఉంటున్నాడు. ఆశల నీడలలోనే జీవితాన్ని అభివృద్ధిపరచుకోటానికి ప్రయత్నిస్తున్నాడు. ఆశ లేకుండా ఒక్క క్షణమైనా ఉండలేకపోతున్నాడు. తనలో దివ్యత్వమనే ఆత్మతత్త్వము ఉండికూడా అపవిత్రమైన విషయవాసనలకు లోబడి మానవత్వాన్ని విస్మరిస్తున్నాడు.

**మితిమీరిన ఆశలు ఉండరాదు**

పశువులు, పక్షులు యివన్నీ ఆనందాన్ని అనుభవిస్తూనే ఉన్నాయి. అయితే, దాచుకొనే స్వార్థముగాని, దోచుకొనే దుర్మార్గముగానీ వాటికి లేదు. మానవునిది తిని తృప్తిపడే స్వభావముకాదు. ఒకరిని మించి మరొకడు అభివృద్ధి చెందాలని పంచవర్ష ప్రణాళికలు వేసుకుంటూ ఉంటారు. ఐదు కరువులు వచ్చినా, ఐదు తరాలు గడచినా తరగని ఆస్తిని పెంచుకోవాలని ప్రాకులాడుతుంటారు. ఆశలు ఉండటం తప్పుకాదు. కాని, మితిమీరిన ఆశలు ఉండరాదు. 'అతి సర్వత్ర వర్జయేత్.' అత్యాశలు మతిహాని కలిగిస్తాయి. ఇలాంటి స్థితిలో మానవుడు తనలో దివ్యత్వాన్ని కొంత హెచ్చరించుకోవాలి. ఈనాడు స్వలాభముమీద ఆసక్తికాని, లోభముమీద విరక్తిగాని అసలు కలగటమే లేదు. కరువు, కాటకాలకు యీ ఆశలే కారణము. ఆశలను అదుపులో ఉంచుకోవాలన్నదే రామాయణములోని ప్రధాన సందేశము. ఇంద్రియ నిగ్రహము, మానసిక పరివర్తన, బుద్ధి వికాసముచేత జీవితములో శాంతిని అభివృద్ధి పరచుకోవాలి. జీవితమెంతో విలువైనది, పవిత్రమైనది. ఇట్టి పవిత్రమైన, విలువైన జీవితాన్ని వ్యర్థము గావించుకోటము మానవ కర్తవ్యము కాదు.

**లక్ష్మణుని శీలము, గుణము లోకానికే ఆదర్శప్రాయమైనవి**

రామాయణములో ప్రతివ్యక్తి ఆదర్శప్రాయుడే! అందరూ ధర్మమూర్తులే! పవిత్ర చక్రవర్తులే! మచ్చుకు లక్ష్మణుని పాత్రను తీసుకుందాము. లక్ష్మణుని వాల్మీకి చక్కగా వర్ణిస్తాడు. లక్ష్మణుడు, రామునికి రెండో హృదయమంటాడు. కంబ రామాయణము లక్ష్మణుడు, రామునికి రెండో గుణము అని వర్ణిస్తుంది. తులసీ రామాయణం లక్ష్మణుడు, రామునికి కుడి భుజమువంటివాడంటుంది. రామ, లక్ష్మణులు బింబ ప్రతిబింబాలవలె అవినాభావ సంబంధము గలవారు. గుణ గణాలలో, పవిత్రతలో, త్యాగములో లక్ష్మణుడు తనకు తానేసాటి. తండ్రి ఆజ్ఞ వలన రాముడు అరణ్యానికి పోవలసి వచ్చింది. లక్ష్మణుని అరణ్యానికి పొమ్మని ఎవ్వరూ

srisathyasaivachanamrutam

ఆజ్ఞాపించలేదు. అతడు తనకు తానే సర్వస్వము త్యాగముచేసి రాముని అనుసరించాడు. రామ అయనమే తన ప్రధాన నయనంగా భావించాడు. అదే రామ అయనం. రామ అయనంలో ప్రధానపాత్ర వహించినవాడు, లక్ష్మణుడు. తల్లిని, రాజ్యమును, సతిని సర్వస్వమును త్యాగము చేసి రామతత్త్వమే గురుతత్త్వమని, రాముడే మిత్రుడు, రాముడే సోదరుడు, రాముడే ప్రాణమని భావించి రాముని అనుసరించాడు. లక్ష్మణుని శీలము, గుణము లోకానికే ఆదర్శప్రాయం.

సీతాన్వేషణ సలుపుతూ వెళ్ళుతుండగా దారిలో ఋష్యమూక పర్వతముపై సుగ్రీవ, హనుమంతులతో స్నేహము కలిగింది, రామ లక్ష్మణులకు. అక్కడ సుగ్రీవుడు ఒక నగల మూట రాముని చేతికి అందించి "ఎవరో ఒక స్త్రీ ఆకాశ మార్గములో పయనిస్తూ యీ మూటను క్రింద జారవిడచింది", అని చెప్పాడు. ఆ మూటను విప్పి చూచినప్పుడు రామునికి యీ నగల సంగతి యేమీ తెలియదు. లక్ష్మణునికి చెప్పాడు, "లక్ష్మణా! యిందులో సీతనగలేమైనా ఉన్నాయేమో చూడు", అని. 'నాహం జానామి కేయూరే' ఈ కంకణాలు సీతమ్మవి అవునో, కాదో నాకు తెలియదు. 'నాహం జానామి కుండలే', ఈ కర్ణ కుండలాలుకూడా సీతమ్మవి అవునో, కాదో నాకు తెలియదు. 'నూపురేత్వభి జానామి', ఈ కాలి అందెలు మాత్రము సీతమ్మవే. నాకు తెలుసు, యెందుకనగా 'నిత్యమ్ పాదాభివందనాత్' ప్రతి నిత్యము ఆమె పాదాలకు నమస్కారము చేసే సమయములో యీ పాదాల అందెలు నేను చూచేవాడిని అని చెప్పాడు, లక్ష్మణుడు. సీతారాముల కళ్యాణము జరిగిన తరువాత పన్నెండు సంవత్సరాలు అయోధ్యలో ఉన్నారు. తదుపరి పదమూడు సంవత్సరములు అరణ్యవాసము చేశారు. ఈ యిరవై ఐదు సంవత్సరములు సీతారాములతో ఉన్న లక్ష్మణుడు ఒక్కనాడైనా సీత ముఖము చూచినవాడు కాదు. పన్నెండు సంవత్సరముల అయోధ్యవాసము, పదునాలుగు సంవత్సరముల వనవాసము మొత్తము యిరవై ఆరు సంవత్సరములు కావాలి. ఐతే పదినెలలు సీత లంకలో చిక్కుపడిపోయింది గదా, అందువల్ల లక్ష్మణుడు పదమూడేండ్లు వనవాసమని అంటాడు.

ఈ విధమైన ఉదాత్తగుణములు గల పురుషుడు, స్త్రీలను మాతృమూర్తులుగా చూచేవాడు చరిత్రలో మరొకరు మనకు కనుపించడు. రామాజ్ఞను పురస్కరించుకొని నిండు గర్భవతి సీతను మునిపల్లెలో విడిచి రావటానికి బయలు దేరాడు. ఆ సమయములో సీత ప్రశ్నిస్తుంది,

srisathyasaivachanamrutam

"లక్ష్మణా! రాముడు లోకాపవాద భీతితో నన్ను అడవులకు పంపటములో ధర్మము ఉంది. ప్రజా పరిపాలనే ప్రభువుల ధర్మము. ప్రజలకు ఆదర్శవంతమైన జీవితాన్ని అందించటమే ప్రభువు కర్తవ్యము. స్వపర భేదము లేకుండా సర్వము త్యజించి ప్రజల క్షేమాన్ని చూడటమే ప్రభువు నియమము. అతని కీర్తియే నాకు ఆనందము. అతను నన్ను త్యజించినా నాకు దుఃఖములేదు. రాముని కీర్తి చిరకాలము వర్ధిల్లాలి. కానీ, నీవు మరిదివి. ఈ అడవిలో నన్ను వదలి యేరీతిగా వెనుకకు పోగలవు? నిండు గర్భవతినైన నన్ను ఒంటరిగా వదలి పోటానికి నీమనసెట్లా ఒప్పుతుంది? కొంతకాలము యిక్కడ ఉండి నాకు ధైర్యము చెప్పరాదా", అన్నది. అప్పుడు లక్ష్మణుడు "తల్లీ! యింతకాలము నీమోమునుకూడా నేను చూడలేదు. రామప్రభువు నీ చెంత లేనప్పుడు నేను నీ దగ్గర ఉండటం ఎంత అపచారము! నిర్గుణ, నిస్వార్థమైన నీ హృదయాన్ని, అజ్ఞానులు బాధపెట్టారు. ఈ సమయములో నేను నీ దగ్గర ఉండటంవల్ల నీకు అపకీర్తి తెచ్చినవాడనౌతాను. నా ప్రాణములనైనా నీ పాదములముందు అర్పితము గావిస్తాను గాని, నీకు అపకీర్తి మాత్రం రానీయను. పైగా రామాజ్ఞ. రాముడే నాసర్వస్వము. అతని ఆజ్ఞను మీరుతే నా ప్రాణమే ఉండదు. కనుక, తల్లీ! నన్నుక్షమించి పంపమ"ని బాధపడుతూ నమస్కారము చేస్తాడు. తనకు ఎదురు వచ్చిన రాజ్యాన్నికూడా స్వీకరించకుండా రాజుగా ఉండటానికి రాముడే అర్హుడని చాటి రాముని సన్నిధే తన పెన్నిధిగా భావించి క్షణకాలములో అరణ్యానికి బయలుదేరిన ధీరచిత్తుడు లక్ష్మణుడు. భగవత్ తత్త్వాన్ని నిస్వార్థ భావముతో గ్రహించి స్వప్రయోజనమును త్యాగము చేసి సర్వస్వాన్ని దైవార్పితము గావించి రాముని అనుసరించిన పరమ భక్తుడు.

## మానవుని హృదయతత్త్వమునుండి ఆవిర్భవించే స్వభావమే ధర్మము

భరతుడుకూడా యీ మార్గమునే అనుసరించాడు. సోదరులందరు రామతత్త్వాన్ని అనుసరించినవారే! కనుకనే రామచరిత్రకు రామాయణమని పేరు సార్థకమై నిలిచింది. "రామో విగ్రహవాన్ ధర్మః", రాముడు ధర్మ స్వరూపుడు. ధర్మమంటే ఏమిటి? ఈనాడు లౌకిక ధర్మాలు అనేకము పెరుగుతున్నాయి. ఏది వైదిక ధర్మమో విచారిస్తే మనసు తబ్బిబ్బయిపోతుంది. 'ధారయతీతి ధర్మః'. తరింపచేసేది, లోకాన్ని ధరింపచేసేది ధర్మమని మనం నోటితో ఉచ్చరించవచ్చు. ఒక్కొక్క

srisathyasaivachanamrutam

వస్తువుకు ప్రాణసమానమైన ధర్మమొక్కొక్కటి ఉంటుంది. అగ్నికి దహనశక్తి సహజధర్మము. అగ్నిలో దహనశక్తి లేకపోతే అది బొగ్గవుతుంది కాని, అగ్ని కాదు. చక్కెరకు తీపి సహజధర్మము. చక్కెరకు తీపి అనే ధర్మం లేకపోతే అది యిసుకతో సమానమవుతుంది. చంపక పుష్పానికి సుగంధము, సహజ ధర్మము. సుగంధము లేకపోతే అది చంపకమే కాదు.

మానవుని హృదయతత్త్వమునుండి ఆవిర్భవించే స్వభావమే ధర్మము. కానీ, యీనాటి మానవుడు ప్రభావానికి లోబడి స్వభావాన్ని మరచిపోతున్నాడు. విద్యావంతులైనా, విద్యాహీనులైనా సర్వమానవులకు సహజమైన ధర్మమేమిటి? ఇతరులు యేవిధముగా గౌరవిస్తే మనకు ఆనందమో మనము యితరులను ఆవిధముగా గౌరవించాలి. ఇతరులు ఎట్టి పనులు చేస్తే మనకు బాధ కలుగుతుందో అట్టి పనులు చేసి మనము యితరులకు బాధ కలిగించరాదు. ఇతరులు యేవిధముగా నడచుకుంటే సరైన మార్గమని భావిస్తామో, మనము ఆవిధముగా నడచుకోవాలి. అదే మనము లౌకిక సామాన్య జగత్తుకు అందించగల సహజ ధర్మము. వైదిక ధర్మాన్ని, వేదాంత ధర్మాన్ని అందరూ గుర్తించలేరు. నిత్యజీవితములో సత్యజీవితాన్ని అనుభవించాలనుకుంటే యితరులు యేవిధముగా నడచుకోటము మంచిదని మనము భావిస్తామో దానిని అనుసరించాలి, ఆచరించాలి.

ధర్మము oneway traffic కాదు. ఇచ్చి పుచ్చుకునేది. ఇలాంటి సహజమైన ధర్మాన్ని రామ తత్త్వముద్వారా జగత్తులో వ్యాపింప చేశాడు, వాల్మీకి. ఒక్కొక్క కాలానికి ఒక్కొక్క ధర్మము ఒక్కొక్క రీతిగా వ్యాపిస్తుంది. ఒక మంచి జాతి మామిడి చెట్టున్నది. ఫలాలుగా మారినప్పుడు వాటిలో మధురమైన రసం అభివృద్ధి చెందుతుంది. కాని కసుగాయలుగా ఉన్నప్పుడు వగరుగా, పుల్లగా ఉంటాయి. జాతి మంచిదే అయినా కసుగాయగా ఉన్నప్పుడు ఒక రుచి, పరిపక్వ స్థితికి వచ్చినప్పుడు మరొక రుచి ఉంటుంది. అదే రీతిగా మానవజాతి అత్యుత్తమైనప్పటికి చాలా భాగము కసుకాయలుగా పక్వము కాకుండానే రాలిపోతాయి. మరికొన్ని పరిపక్వ స్థితిలో రాలిపోతుంటాయి. ఫలించి పక్వమైనవే చక్కని రుచి నందిస్తాయి. సర్వుల యందున్న ఆత్మతత్త్వము ఒక్కటే దీనికి చక్కని ఉదాహరణ. సముద్రములో అసంఖ్యాకమైన అలలు బయలు

sri sathyasai vachanamrutam

దేరుతూ ఉంటాయి. ఒక అల ఉన్నట్లు మరొక అల కనుపించదు. అలలు భేదముగా ఉన్నప్పటికి అలలు వేరు, సముద్రము వేరు కాదు. అలలన్నీ సముద్రములో చేరే ఉంటాయి.

**నీటిని వదలి చేప ఉండలేనట్లే దైవాన్ని వదలి నరుడు ఉండలేడు**

ఆత్మ తత్త్వమనే బ్రహ్మానందములో ఆవిర్భవించిన జీవులనే అలలే మానవులు. ఒక్కొక్క మానవుని రూప, భావ, తత్త్వాలు ప్రత్యేకముగా ఉండవచ్చు. కానీ, యివన్నీ బ్రహ్మానందములోని బిందువులనే తత్త్వాన్ని మనం గుర్తించాలి.

**నీటియందే పుట్టి నీటియందే పెరిగి**
**నీటియందే అణగు నీటి బుడగ**
**నరుడు బుద్బుదంబు నారాయణుండు నీరు**

నరుడనే బుడగ నారాయణునియందే పుట్టింది. నారాయణుడనే నీటియందే సంచరిస్తుంది. నారాయణుడనే నీటియందే నశించిపోతుంది. నారాయణుడనే నీటిని వదలిన నరుడనే బుడగ ఉండలేదు. అందుకనే 'మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః', జీవులన్నీ నా అంశములే, అని భగవద్గీతలో చెప్పబడింది. చెట్టుకు, కొమ్మ అంశము. చెట్టును వదలి కొమ్మ ఉండలేదు. చెట్టును వదలితే, కొమ్మ ఎండి పోతుంది. తల్లికి బిడ్డ అంశము. తల్లిని వదలి బిడ్డ బ్రతుకలేదు. నీటిని వదలి చేప ఉండలేనట్లే దైవాన్ని వదలి నరుడు ఉండలేడు. అశాంతి అనుభవించటానికి కారణము, ఎడబాటు. ధన, కనక, వస్తు, వాహనాలు యివన్నీ ఆనందాన్ని అందించలేవు. మానవుడు భార్యాపుత్రుల నిమిత్తమై, కుటుంబ బంధువుల నిమిత్తమై యెంతకాలము వినియోగిస్తున్నాడో అందులో ఒక్క క్షణకాలము భగవత్‌చరణ ధ్యానములో వినియోగిస్తే చాలు. దివ్యత్వాన్ని గురించి ఒక్కక్షణము చింతించినా చాలు.

**ఆత్మను ఉల్లంఘిస్తే ఆనందము దూరమవుతుంది**

ఈనాడు మనలో త్యాగమే లేదు. త్యాగము చేయని చేయికంటె చీకటి కొంపలోని నుయ్యి మేలు. చదువుకున్న మొద్దుకంటె మడిదున్నే ఎద్దు మేలు. త్యాగభావముతో జీవితమును అర్పితము చేసినప్పుడు నిజమైన యోగము లభ్యమవుతుంది. మానవజాతికి యిలాంటి త్యాగాన్ని బోధించేది, రామాయణము. రాముడు తండ్రి ఆజ్ఞను పురస్కరించుకొని సర్వసంగ పరిత్యాగియై

sri sathyasai vachanamrutam

నారవస్త్రములు కట్టి అరణ్యములో ప్రవేశించాడు. భగవదాజ్ఞ పరిపాలన తత్త్వాన్ని నిరూపించిన వాడు, రాముడు. ఆత్మ అనేది మహాశాసనము. ఆత్మను ఉల్లంఘిస్తే ఆనందము దూరమవుతుంది.

పర్ణశాలలో వంటరిగా ఉన్న సీతను కాపాడమని, ఎలాంటి స్థితిలోను సీతను వదిలి పోకూడదని లక్ష్మణుని ఆజ్ఞాపించి వెళ్లాడు, రాముడు. కష్టాలు, దుఃఖాలు, నిందలు, నిష్ఠూరాలు ఎన్ని వచ్చినా సీతను వదలి రాకూడదని హెచ్చరించాడు. కానీ, లక్ష్మణుడు జీవస్వరూపుడు. కనుక, అతనిలో కొంత బలహీనత బయలుదేరింది. 'హా సీతా! హా లక్ష్మణా!' అనే ఆర్త నాదము విని దానిని నిజముగా రాముని కంఠముగా భావించి వెంటనే రామునివద్దకు వెళ్లమని సీత లక్ష్మణుని బలవంతము చేసింది. ఏది యేమైనా రామాజ్ఞను కఠినముగా పాలించదలిచాడు లక్ష్మణుడు. కాని సీత సూటిపోటు మాటలు హృదయానికి గుచ్చుకొని బాధించసాగాయి. సీత పరుషవాక్కులు వినలేక రామాజ్ఞను మీరి సీతను వదలి అక్కడనుండి కదిలాడు. తదుపరి సీతను రావణుడు తీసుకుపోవటం తెలిసి చాలా బాధపడ్డాడు. 'తాను దైవాజ్ఞను మీరటమువల్లనే కదా సీతకు యిన్ని కష్టాలు వచ్చాయి', అని జీవితాంతము దుఃఖించాడు. తన జీవితములో రామాజ్ఞను మీరిన సంఘటనలలో యిది మొదటిది.

రాముడు, సీతతో తన స్వస్థానానికి పోయేముందు కాలయముడు వచ్చాడు. అతనితో సంభాషిస్తూ రాముడు, 'లక్ష్మణా! ఎవరినీ విడువకు. ఏ ఒక్కరిని లోపలకు వదలినా శిరచ్ఛేదనము, జాగ్రత!' అంటూ ఆజ్ఞాపించాడు. లక్ష్మణునికి రాముడంటే దృఢమైన విశ్వాసము. సరిగ్గా ఆ సమయములో దూర్వాసుడు వచ్చి తాను లోపలికి వెళ్లి రామునితో సంభాషించాలన్నాడు. లక్ష్మణుడు లోపలికి పోవటానికి వీల్లేదని ఖచ్చితంగా చెప్పాడు. దుర్వాసుడు ఉగ్రుడై పోయాడు. 'నీ అయోధ్యను, నీవంశమును సర్వనాశనము చేస్తాను, జాగ్రత్త!' అని గర్జించాడు. లక్ష్మణుడు ధర్మసంకటములో పడ్డాడు. వదలితే తనకు శిరచ్ఛేదము. వదలకపోతే రఘువంశంతోపాటు అయోధ్యకూడా నాశనం అయిపోతుంది. ఆలోచించి ఒక దృఢ నిశ్చయానికి వచ్చాడు. 'రాముని ఆజ్ఞ మీరటంవలన నాశిరస్సు పోతుంది. అయినా ఫరవాలేదు. అయోధ్యావాసులు క్షేమంగా ఉండాలి. రాముని చేతులలో చావటం యెంత అదృష్టము! దుర్వాసుని ఆజ్ఞ మీరితే వంశమే



sri sathyasai vachanamrutam

నాశనమవుతుంది', అనుకొని దుర్వాసుని లోపలకు వదిలాడు. ఇట్టి ఆదర్శ ఘట్టాలతో నిండిఉన్నది, రామాయణము. కానీ, ఈనాడు ఎవరిగుణములకు తగినట్లు వారు అన్వయించుకుంటూ రామాయణాన్ని వ్యాఖ్యానిస్తున్నారు.

**ఈనాడు ప్రతికుటుంబానికి రామాయణ ఆదర్శాలు ఎంతైనా అవసరము**

అన్నదమ్ములు యేరీతిగా ఉండాలి? తల్లితండ్రుల ప్రేమ యే రీతిగా ఉండాలి? భార్యా భర్తల ఆదర్శము యేరీతిగా ఉండాలి? ఈ విధముగా ప్రతి కుటుంబానికి ఆదర్శమును బోధించింది, రామాయణము. లక్ష్మణుడు, భరతుడు, శతృఘ్నుడు అందరు రామ అయనంలో రామ మార్గంలోనే జీవితాలను అంకితము చేశారు. అన్న ఆజ్ఞను జవదాటకుండా జీవించారు. ఈనాడు ప్రతి కుటుంబానికి రామాయణ ఆదర్శాలు యెంతైనా అవసరము. సీత సర్వసుఖములను త్యాగము చేసి భర్తను అనుసరించింది. భోగభాగ్యాలను యెంతమాత్రము ఆశించలేదు. తన జీవితాన్ని రామాంకితము గావించిందామె.

**రావణ, హిరణ్య కశిప, దుర్యోధనులు కామ, క్రోధ, లోభములకు ప్రతీకలు**

రామాయణ, భాగవత, భారతాలు కామ, క్రోధ, లోభాలకు మూలాధారముగ నిలిచిన చరిత్రలు. రామాయణంలో రావణుడు అంటేనే కామం. కాముకుడైన రావణునివల్లనే రామాయణమంతా జరిగింది. కామనాశంకోసమే రాముడవతరించాడు. భాగవతములో హిరణ్యకశిపుడు క్రోధము. అతను హరిద్వేషి. 'ఎక్కడున్నాడు హరి, వాడెక్కడా లేడు', అనేవాడు. ఈ క్రోధాన్ని పరిహరించటానికే హరి నరసింహుడుగా అవతరించి హిరణ్యకశిపుని సంహరించాడు. క్రోధాన్ని యీ విధముగా పరిమార్చాడు. భారతములో దుర్యోధనుడు లోభమునకు మచ్చుతునక. రావణ, హిరణ్య కశిప, దుర్యోధనులంటే కామ, క్రోధ, లోభములే! ఈ మూడింటిని అంతమొందించటానికే మూడు చరిత్రలు లోకములో వెలిశాయి. మూడింటిలోను ధర్మాన్ని బోధించటానికే ప్రయత్నం జరిగింది.

లోభియైన దుర్యోధనుడు తల్లిగాంధారికి నమస్కరించటానికి వచ్చాడు. ఆమె తన కుమారుడనే మమకారానికి లోనుగాక 'యతో ధర్మస్తతో జయః' అని ఆశీర్వదించింది. ఎక్కడ ధర్మమో అక్కడ జయమన్నది కానీ నీకు జయమనలేదు. గురువైన ద్రోణాచార్యునికి

sri sathyasai vachanamrutam

నమస్కరించటానికి వెళ్లాడు దుర్యోధనుడు. "యతో ధర్మస్తతో జయః, యతో కృష్ణః తతో జయః' అన్నాడు ద్రోణాచార్యుడు. ఎక్కడ ధర్మమున్నదో అక్కడ కృష్ణుడు ఉంటాడు. ఎక్కడ కృష్ణుడు ఉంటాడో అక్కడ జయం కలుగుతుంది అని ఆశీర్వదించాడు ఆయన.

**యత్రయోగేశ్వరః కృష్ణో యత్ర పార్థోధనుర్ధరః**
**తత్ర శ్రీ ర్విజయోభూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ**

ఎక్కడ ధర్మము ఉంటుందో, అక్కడే విజయము అంటుంది, గీత.

రాముడు అరణ్యానికి వెళ్లేముందు తల్లి కౌసల్యాదేవికి నమస్కరించాడు. నాయనా! నీ ధర్మమే నిన్ను అరణ్యములోకూడా రక్షిస్తుంది', అని ఆశీర్వదించింది మాతృమూర్తి. లక్ష్మణుడు వచ్చి తన మాతృదేవి సుమిత్రకు నమస్కరించాడు. ఆమె పేరే సుమిత్ర. మైత్రి ఆమె సహజ గుణము. తన కుమారుడనే అభిమాన మమకారాలకు తావీయక 'రాముడు లేని అయోధ్య అరణ్యము, రాముడున్న అరణ్యమే అయోధ్య. వెళ్ళిరా నాయనా! రాముడు లేని అయోధ్య అనే అరణ్యమే మాకు గతి. రామసన్నిధినే అయోధ్యగా భావించి జీవితాన్ని ధన్యము చేసుకో నాయనా!' అని తనయునికి బోధించింది, ఆ తల్లి. ఇలాంటి తల్లులు, తండ్రులు, గురువులు ఉండటం చేతనే ఆనాడు 'మాతృదేవో భవ, పితృదేవో భవ, అతిథి దేవో భవ, ఆచార్య దేవో భవ', అనే వేదవాక్కులతో దిక్కులు మారుమ్రోగాయి. ఇలాంటి ధర్మ ప్రబోధము చేసిన పవిత్ర గాథలు, రామకృష్ణుల చరిత్రలు.

**మారవలసింది మనసు కాని, మనిషి కాదు**

రామనవమి అనగా రాముడు పుట్టిన దినమని భావించరాదు. రామ తత్త్వాన్ని, రామభావాన్ని ఏనాడు మన హృదయములో ఆవిష్కరింపజేసుకుంటామో ఆనాడే పర్వదినము. పాయసము, పరమాన్నములతో సుష్టుగా భోజనం చేయటం పర్వదినము కాదు. ఆదర్శమైన జీవితాన్ని అన్వయింప చేసుకోవాలి. వారి ఆశయాలను ఆదేశాలను తల దాల్చాలి. వారి అడుగుజాడలను అనుకరించాలి. అప్పుడు జన్మ సార్థక మవుతుంది.

ఒకానొకప్పుడు ముగ్గురు వ్యక్తులు స్వర్గద్వారాన్ని సమీపించారు. ఒకాయన ముందుకు

srisathyasaivahiniamrutam

వెళ్ళి 'నేను సర్వశాస్త్ర పారంగతుణ్ణి. నన్ను స్వర్గంలోకి ప్రవేశపెట్టు', అన్నాడు. అప్పుడు ద్వారపాలకుడు 'అయ్యా! నీకు గ్రంథపరిచయమే తప్ప అనుభవజ్ఞానము లేదు, వెళ్ళిరా' అన్నాడు. ఇంకొకాయన ముందుకు వచ్చి 'నేను యజ్ఞ యాగాదులు ఆచరించిన సోమయాజిని. ద్వారము తెరువు', అన్నాడు. 'కేవలము స్వార్థబుద్ధితోటే యజ్ఞ యాగాదులు ఆచరించావు. నీకు స్వర్గ ప్రవేశాధికారము లేదు, వెళ్లు' అన్నాడు. మూడవవాడు, ఒకరైతు. 'అయ్యా! నాకున్న రెండు ఎకరాలలో చిన్న గుడిసె వేసుకొని వచ్చిపోయే బాటసారులకు వసతి కల్పిస్తూ వున్నదాంట్లో వారికి పెట్టి నేను తింటూ కాలము గడిపాను', అన్నాడు. 'ఉన్న దానిలో కొంత త్యాగము చేసి జీవితం గడపిన నీకు స్వర్గవాసము ఖాయము. లోపలకు వెళ్లు', అంటూ ద్వారము తెరిచారు, ద్వారపాలకులు. ఈనాడు 'మనము యేమి చదివాము, ఎంతవరకు మారాము', అని ప్రశ్నించుకుంటే సరైన సమాధానము రావటం లేదు. వింటున్నంత సేపు బాగానే ఉంటుంది. కొన్ని క్షణాలోన్నే బుద్ధి యథాస్థానానికి వెళ్లిపోతుంది. ఈ మనస్తత్వాన్ని కొంత మార్చుకోవాలి. మనసు మారక మనిషి మారినా ప్రయోజనము లేదు. మారవలసింది మనసు కాని, మనిషి కాదు.

**తమస్సు పోవాలంటే జ్ఞానజ్యోతిని వెలిగించాలి**

రామాయణం ఎంతో ఉన్నతమైన ఆదర్శాన్ని అందించింది. దయ, కరుణ, సానుభూతి యిత్యాది సద్గుణ సంపత్తిని స్వరూపముగా ధరించినట్టిది, రామాయణము. ఈనాటి మానవుడు ఏడు రకాల పగ్గాలతో, తాళ్ళతో కట్టబడి ఉన్నాడు. 1. శరీరము, 2. కర్మ, 3. రాగము, 4. ద్వేషము, 5. అహంకారము, 6. అధికారం, 7. అజ్ఞానము.

అజ్ఞానము అవివేకమునుండి పుట్టింది. అవివేకము అహంకారమునుండి పుట్టింది. అహంకారము ద్వేషమునుండి పుట్టింది. ద్వేషము రాగమునుండి పుట్టింది. రాగము కర్మనుండి పుట్టింది. కర్మనుండి పుట్టినదే దేహము కాబట్టి, దేహానికి కర్మయే ఆధారము. కర్మకు రాగము కారణము. రాగానికి ద్వేషము ఆధారము. ద్వేషానికి అహంకారము మూలము. అహంకారానికి అవివేకము మూలము. అవివేకానికి అజ్ఞానము ఆధారము. మొదట అజ్ఞానము నాశనము కావాలి. చీకటి పోవాలి. ఎంత పోరాడినా చీకటి పోదు. చిన్న దీపము ముట్టిస్తే చీకటి పోతుంది.

ఆ దీపమే దైవ నామము. తమస్సు పోవాలంటే జ్ఞానజ్యోతి వెలిగించుకోవాలి. జ్ఞానాన్ని అభివృద్ధిపరచుకోటానికి నామమనే నావను ఆశ్రయించాలి. అత్యంత ప్రధానమైనవి రెండే రెండు-దానము, నామము అనగా అన్నదానము, హరినామము. ఈ రెండు రెక్కలతో మనము స్వర్గానికి ఎగరగలము.

**(తేదీ. 26-03-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam